రేషన్‌కు లేదు పరేషాన్

- లేవిక క్యూలు.. గంటల తరబడి ఎదురుచూపులు
- ఇంటి వద్దకే పంపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- సీఎం జగనన్నకు రుణపడి ఉంటామంటున్న లబ్ధిదారులు


ఇంటి వద్దే సరకులు పంపిణీ చేస్తున్న రేషన్ వాహనదారుడు

కాకినాడ సిటీ: ఇచ్చేది కొద్దిపాటి సరకులు. అవి కూడా నాణ్యత అంతంతమాత్రం, ఏవో అక్కరకు వస్తాయనుకుంటే.. పొద్దెక్కినప్పటి నుంచీ పొద్దు పోయే వరకూ క్యూలో పడిగాపులు చేయాల్సిన పరిస్థితి. హమ్మయ్య.. మా వంతు వచ్చిందనుకుంటే.. సరకులు అయిపోయాయని రేషన్ డీలర్ నుంచి ఓ అరుపు. సరకులు వచ్చాక రండంటూ నో స్టాక్ బోర్డు ప్రత్యక్షం. దీంతో ఉసూరుమంటూ నిరాశతో వెనుదిరగడం లబ్ధిదారుల వంతు. ఇదీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ షాపుల చిత్రం. ఇప్పుడు... పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచీ రేషన్ సరఫరా తీరు పూర్తిగా మారిపోయింది. లబ్ధిదారులు ఇంటి గడప దాటకుండానే.. రేషన్ సరకులన్నీ ముంగిటకు చేరిపోతున్నాయి. నో స్టాక్ బోర్డులకు, గంటల తరబడి పడిగాపులకిక పూర్తిగా కాలం చెల్లిపోయింది. జగనన్న ఆశించినట్టుగా ఇప్పుడు లబ్ధిదారుల మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది.

రేషన్ సరకుల కోసం గతంలో డిపోలకు కిలోమీటర్ల మేర నడుచుకుని వెళ్లాల్సి వచ్చేది. ఒకటి, రెండు రోజులు పట్టే సందర్భాలూ అనేకం. కూలీ పని చేసే వారికి ఇది మరింత ఇబ్బందిగా ఉండేది. కొన్నిసార్లు డీలర్ అందుబాటులో ఉండేవారు కాదు. తూకంలో మోసాలు సరేసరి, వృద్ధులు, దివ్యాంగులు మరిన్ని అవస్థలు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఇంటికే రేషన్ సరకులు అందించడానికి ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. వారికి వాహనాలు అందించారు. ఇంటి వద్దే రేషన్

మండలాలు	ఎండీయూ వాహనాలు	బియ్యం కార్డులు	రేషన్ షాపులు
21	420	5,64,119	1,060

పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడంతో లబ్ధిదారుల ఇబ్బందులు తొలగిపోయాయి.

జీపీఎస్.. మ్యాపింగ్

తూకాల్లో మోసాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రైస్ కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి సరకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏ రేషన్ షాపు పరిధిలో ఉన్నా, నివసించే ప్రాంతంలోని చౌకదుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళితే ఆ ప్రాంత వలంటీర్‌కు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేయించుకుంటే చాలు. గడప దాటకుండానే నెలారంభంలో పది రోజుల్లోగా సరకులు అందుతున్నాయి. ఏ రోజు, ఏ వీధిలో, ఎవరింటి వద్ద, ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరుంటే చాలు సరకులు ఇచ్చేస్తారు.

రేషన్ కష్టాలు తీరాయి



గతంలో రేషన్ సరకులు తీసుకోవాలంటే చాలా కష్టాలు పడాల్సి వచ్చేది. రేషన్ సరకుల కోసం ఉదయం వెళ్లితే మధ్యాహ్నం అయ్యేది. నెలవారీ రేషన్ కోసం ఒక్కరోజు భోజనం మానుకుని వెళ్లితేనే సరకులు అందే పరిస్థితి గతంలో ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రేషన్ కష్టాలు గట్టెక్కాయి. ఇప్పుడు రేషన్ సరకులు నేరుగా మా ఇంటి వరకు వచ్చి, వాహనం ద్వారా అందిస్తున్నారు. ప్రతినెలా నేరుగా ఇంటి వద్దకు రేషన్ తీసుకువచ్చి క్షణంలో సరకులు అందజేయడం సంతోషంగా ఉంది.

– గుడాల ఉమాదేవి, బుల్లబ్బాయిరెడ్డినగర్, తూరంగి

కిలోమీటర్లు నడిచే కష్టం తప్పింది



రేషన్ సరకుల కోసం కిలోమీటర్ల దూరం నడిచే కష్టం తప్పింది. గ్రామానికే వచ్చి రేషన్ సరకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. పేదలకు అందించే సరకులు నేరుగా గడప వద్దకే తీసుకువచ్చి, సమయానికి అందజేయడం సంతోషంగా ఉంది. పేదలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు.

– చెక్కా శ్యామల, తూరంగి

ఇంటి వద్దకే సరకులు



గతంలో రేషన్ షాపులకు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి బియ్యం తెచ్చుకునేవారం. ప్రస్తుతం ఇంటి వద్దకే వ్యానులో వచ్చి సరకులు ఇస్తున్నారు. మా లాంటి పేదలకు ఇలాంటి సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– సూరాడ నవీన, పగడాలపేట, తూరంగి

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ కాకినాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త కాకినాడ, ఆదిత్య పీజీ కళాశాల రోడ్డు, అయోధ్యనగర్ అక్షరాస్కూల్ ప్రాంతం, కన్నయ్యకాపు నగర్, సీతారామ రత్ననగర్, లక్ష్మీనగర్, గొడారి గుంట, గొడారిగుంట లక్ష్మీ హాస్పటల్, శాంతినగర్, ఎన్జీఓ కాలనీ, భాస్కర్‌నగర్, కోకిల సెంటర్, పేర్రాజుపేట, రేచర్లపేట, బర్మాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సంతచెరువు పరిధిలో..

కాకినాడ సంతచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వార్షిక మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఫీడర్ పరిధిలోని మంత్రిప్రగడ వారివీధి, సూర్యనారాయణపురం, రెల్లి వీధి, రంగయ్యనాయుడువీధి, లక్ష్మీనారాయణ కంపెనీ వీధి, సినిమా రోడ్డు, పెద్దమార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డి–7 పరిధిలో..

డి–7 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వార్షిక మరమ్మతుల దృష్ట్యా స్వర్ణాంధ్రకాలనీ, ఏఎంజీ రోడ్, రాజీవ్ గృహకల్ప, డెయిరీ ఫారం, నూకాలమ్మ మాన్యం, టిడ్కో అపార్ట్‌మెంట్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సరఫరా నిలిపివేత

కరప: వేళంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేళంగి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో పాటు, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తారని చెప్పారు. వేళంగి, శివారు కొప్పిశెట్టివారి వీధి, కూరాడ, శివారు చినమామిడాడ, సిరిపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సానా ఈశ్వర ప్రసాద్ తెలిపారు.

డ్రగ్స్ బానిసత్వానికి యువత నిర్వీర్యం

జమాత్‌–ఎ–ఇస్లామీ హింద్ అధ్యక్షుడు ఇబ్రహీం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

బోట్‌క్లబ్: దేశానికి వెన్నెముక అయిన యువత డ్రగ్స్, మద్యానికి బానిసలుగా మారి అమూల్యమైన జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారని జమాత్–ఎ–ఇస్లామీ హింద్ సంస్థ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం, ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం.. నినాదంతో ఈ నెల 8 నుంచి 18 వరకు జమాత్–ఎ–ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యమంలో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇబ్రహీం మాట్లాడుతూ జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం, మద్యపాన వ్యసనం వల్ల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉమైమా సిద్ధిఖా మాట్లాడుతూ దేశంలో 70 నుంచి 85 శాతం మహిళలపై నేరాలు మద్యపానం కారణంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువకులు మాదక ద్రవ్యాల వాడకంతో నేరాల పెరుగుదలకు కారకులవుతున్నారని, ఇది దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని హెచ్చరించారు. మద్యం కారణంగా 60 శాతం కంటే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, కాకినాడ జిల్లా బాధ్యులు షేక్ ఇబ్రహీం, సంస్థ సభ్యులు అల్తాఫ్ హుస్సేన్, రహతుల్లా షరీఫ్, మహిళా సభ్యురాలు గుల్జార్ బేగం పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

కలెక్టర్ కృతికా శుక్లా


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి వికాస సంస్థ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, ఆయా సంస్థలకు రక్తాన్ని సరఫరా చేస్తోందన్నారు. ఈ రోజు నిర్వహించిన రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు అందిస్తారని తెలిపారు. వికాస సంస్థ ద్వారా ఉద్యోగం, శిక్షణ నిమిత్తం నిత్యం అనేక మంది వస్తుంటారని, వారందరూ రక్తదానం ఆవశ్యకతను గుర్తించి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇప్పటి వరకు వికాస ద్వారా 245 మంది రక్తదానం చేశారని వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. బుధవారం నిర్వహించిన శిబిరంలో 60 మంది యువత పాల్గొన్నారని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, వికాస మేనేజర్ పి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ప్రయాణికులపై దాడులు


ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు

కొత్తపల్లి: ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణికులపై తరచూ గంజాయి బ్యాచ్ దాడులు చేస్తోంది. రాత్రులు ఒంటరిగా వెళ్లే ప్రయాణికులపై దాడి చేసి వారి వద్ద ఉన్న నగదు, విలువైన వస్తులు లాక్కొంటున్నారు. ఇటీవల ఉప్పాడకు చెందిన ఓ వ్యక్తి తన సోదరుడు ఊరు నుంచి వస్తుండగా తీసుకురావడానికి బీచ్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎస్పీజీఎల్ విద్యుత్ కర్మాగారం దాటిన తరువాత చిన్నవంతెన సమీపంలో ఒక్కసారిగా పలువురు యువకులు వచ్చి అడ్డగించారు. తన వద్ద ఉన్న నగదు లాక్కోవడంతో పాటు దాడి చేసి గాయపరిచారు. గతంలో కూడా లారీని అడ్డగించి డ్రైవర్ వద్ద ఉన్న సొమ్ములు లాక్కున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడును వివరణ కోరగా ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డుపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రయాణికులపై దాడులకు సంబంధించి సూర్యారావుపేట లైట్‌హౌస్, ఉప్పాడ సెంటర్‌లోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితులను గుర్తిస్తామన్నారు. రాత్రి గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.

శివుడు ప్రత్యక్షమైన క్షేత్రం

- రేపు చొల్లంగి అమావాస్య తీర్థం
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు


ఉప్పలంక శివారు మొండి వద్ద ఆలయంలో బాలాత్రిపుర సమేత సంగమేశ్వరస్వామి

కరప: పురాణ ప్రసిద్ధిగాంచిన చొల్లంగి అమావాస్య తీర్థం శుక్రవారం ఉప్పలంక శివారు మొండి వద్ద సముద్ర తీరాన జరుగనుంది. చొల్లంగి తీర్థానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి సముద్ర స్నానం చేయడం పరిపాటి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ, పోలీసు శాఖలతో పాటు, ఉప్పలంక గ్రామ పంచాయతీ సంయుక్తంగా తీర్థ ఏర్పాట్లు చేశారు.

ఏటా మాఘమాసం ప్రారంభమయ్యే అమావాస్య రోజున తీర్థం జరుగుతుంది. తుల్యభాగ నదీపాయ సముద్ర తీరంలో కలిసే ప్రదేశమే సాగర సంగమం అంటారు. చంద్రుడు శాప విమోచనం పొందడానికి తన భార్య రోహిణితో కల్సి ఈ సాగర సంగమం వద్ద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడంతో, శివుడు ప్రత్యక్షమై మోక్షం కల్గించినట్టు పురాణాలు చెబుతున్నాయి. చొల్లంగి వద్ద సుమారు నాలుగు వేల ఏళ్ల క్రితమే రాజరాజేశ్వరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయం నిర్మించినట్టుగా చెబుతారు. మొండి వద్ద సముద్ర తీరాన 108 ఏళ్ల క్రితం మల్లాడి సత్యలింగం నాయకర్ సంగమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ఆలయంలో బాలాత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి పక్కనే సీతారాముల ఆలయం, ఆంజనేయస్వామి, కాలభైరవ స్వామి వార్ల ఆలయాలూ ఉన్నాయి.

సప్త సాగర యాత్ర

మాఘమాసం అమావాస్య రోజున సముద్ర స్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి, ఇక్కడ సముద్ర స్నానం ఆచరించి, సంగమేశ్వరస్వామి, భైరవస్వామి, సోమేశ్వరస్వామిని దర్శించు కుంటారు. అమావాస్య మరుసటి రోజు నుంచి సప్త సాగర యాత్ర ప్రారంభమవుతుంది. చొల్లంగి, కోరంగి, తీర్థాలమొండి, రామేశ్వరం, బ్రహ్మసమాఖ్యం, నాసంగితిప్ప, అంతర్వేదిల్లో సముద్ర స్నానం చేస్తే సప్త సాగర యాత్ర పూర్తవుతుంది. సప్త సాగర యాత్ర తర్వాత అంతర్వేదిలోని లక్ష్మీ నరసింహస్వామి తీర్థం జరుగుతుంది. చంద్రునికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు నందీశ్వరునికి కూడా వరమివ్వడం వల్లనే అమావాస్య రోజున అప్పన్నెద్దులకు సముద్రస్నానం చేయిస్తారని పండితులు చెబుతున్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరప ఎస్సై టి.రామకృష్ణ పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు

తీర్థం రోజున ఎంఎస్ఎన్ చార్టీస్ నుంచి మొండి వద్ద స్నానాల రేవు వరకూ ట్రాఫిక్‌ను ఒకరోజు (గురువారం అర్ధరాత్రి నుంచి) మళ్లించినట్టు కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. యానాం వైపు నుంచి తాళ్లరేవు మీదుగా వచ్చే వాహనాలు, పటవల వద్ద నుంచి జి.వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు గ్రామాల మీదుగా కాకినాడకు చేరుకుంటాయన్నారు. కాకినాడ నుంచి తాళ్లరేవు, యానాం వైపు వెళ్లే వాహనాలు, కాకినాడ, తూరంగి, నడకుదురు, గురజనాపల్లి మీదుగా యానాం రోడ్డుకు చేరుకుంటాయన్నారు. స్నానాలరేవు వద్ద, ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉప్పలంక సర్పంచ్ బొమ్మిడి నయోమి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తెలిపారు. స్నానాలరేవు వద్ద గజ ఈతగాళ్లను ఉంచినట్టు, దర్శనాలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు ఎంఎస్ఎన్ చార్టీస్ ఏసీ పి.బాబూరావు తెలిపారు. మొండి వద్ద ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

క్లుప్తంగా

జంక్ ఫుడ్‌తో ఊబకాయం



మాట్లాడుతున్న డాక్టర్ పి.పార్థసారథి

కాకినాడ రూరల్: అధిక క్యాలరీలు ఉన్న జంక్ ఫుడ్ అధికంగా తీసుకుంటే ఊబకాయం వస్తుందని, బాలలు వీటికి దూరంగా ఉండాలని పోషకాహార నిపుణుడు పి.పార్థసారథి అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఊబకాయం ఉన్న పిల్లలు చిన్నతనం నుంచి బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటల ద్వారా శ్రారీరక శ్రమ కలిగించాలని, కొవ్వు పదార్థాలను తక్కువగా తీసుకోవాలన్నారు. ఎక్కువగా పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థినికి బహుమతి ఇస్తున్న డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన డి.సింధూజ, సాయిసహస్ర, షకీర్‌కు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆందోళన

కాకినాడ సిటీ: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేశారు. కేంద్ర లెక్కల ప్రకారం 40 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ధర్నా చేసి, ర్యాలీ నిర్వహించారు. సంఘ నాయకుడు పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


మాత్రలు పంపిణీ చేస్తున్న నరసింహనాయక్

కాకినాడ రూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ కాకినాడ రూరల్ మండల ఆఫీస్‌లో అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో రక్తహీనత, ఇతర అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించేందుకు ఈ నెల 9న ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. అలాగే 9న హాజరుకాని వారితో 16వ తేదీన మింగించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్ నాయుడు, పండూరు, తూరంగి వైద్య అధికారులు డాక్టర్ అయేషా ఫాతిమా, డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి


ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ కిషోర్

కాకినాడ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల వినియోగంపై నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఇట్ల కిషోర్ సెక్టోరల్ అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, వాటి సాంకేతికత తదితర అంశాలపై సెక్టార్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తద్వారా పారదర్శక ఓటింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ బి.విజయప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట చర్యలు

ఆర్డీఓ కిషోర్


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మొత్తం 52 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. 191 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు చర్యలు తీసుకున్నారని, 1,200 మంది పైబడిన ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 24 ఉన్నాయని వివరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్ అప్పారావు, కె విజయరామయ్య, టి నాగేశ్వరరావు, కరప తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ మధు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి


రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కరప: నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్ల పథకంలో రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలపై పూర్తి హక్కులు కల్పించేందుకు నిర్దేశించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. కరప, వాకాడ తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. సచివాలయాల సిబ్బందికి, గ్రామ కార్యదర్శులకు విధివిధానాలపై సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ అప్పారావు మాట్లాడుతూ మండలంలో 2,419 మందికి రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉండగా, ఇంతవరకు 1,548 మందికి చేశామని చెప్పారు. మిగిలినవి నాలుగు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యదర్శులు ఎస్‌కే నాగేంద్రకుమార్, పి.వీరభద్రరావు, వీఆర్వోలు కె.రామకృష్ణారెడ్డి, పీఎంవీ ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు చెక్!

పిఠాపురం: ఏలేరు ఆయకట్టు పరిధిలోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు ఆయకట్టు రైతులు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత దృష్టికి సమస్యను తీసువెళ్లగా వెంటనే పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే... ఏలేరు ఆయకట్టు పరిధిలోని పిఠాపురం మండలంలో శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు ఎంపీ గీత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నీటిపారుదల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ రాంగోపాల్‌లకు సమాచారం ఇచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు బుధవారం సాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. కాండ్రకోట రెగ్యులేటర్ నుంచి ఏలేరు శివారు ప్రాంతమైన పిడిందొడ్డి వరకూ ఉన్న కాలువలు, రెగ్యులేటర్లు పరిశీలించారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు, రాపర్తి, రాయవరం, విరవాడ, ఎల్ఎన్‌పురం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు రైతులతో మాట్లాడారు. నీటి ఎద్దడిని గుర్తించిన అధికారులు తక్షణమే ఏలేరు నుంచి విడుదల చేస్తున్న 800 క్యూసెక్కుల నీటిని పెంచి 1000 క్యూసెక్కులు విడుదల చేయించారు. రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంపీ వంగా గీతకు సమస్యను తెలియజేసిన వెంటనే పరిష్కరించడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు కాశి సురేష్, శ్రీనివాస్, జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ రావుల మాధవరావు, రైతులు పాల్గొన్నారు.

● విరగబూసిన మామిడి చెట్టు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో విరగబూసిన మామిడి చెట్టు

కొత్తపల్లి: ఈ ఏడాది మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. వాతావరణం అనుకూలించడంతో పూత బాగుంది. పలు ప్రాంతాల్లో తేనే మంచు కారణంగా పూత మాడిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూతను కాపాడుకునేందుకు రైతులు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. పూతపై మంచు ప్రభావం పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.